సమష్టిగా పని చేయాలి

మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

కామారెడ్డి, నవంబర్ 23 : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమష్టి సహకారంతో పనిచేయాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారుల సహకారంతో ప్రతిపాదించిన లక్ష్యాలను సాధించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే దిశగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. 23 శాఖలు చేపడతున్న కార్యక్రమాలను సమీక్షించినట్లు తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, గంగాధర్, శ్రీకాంత్, దిశ కమిటీ సభ్యులు, నర్షియ నాయక్ జాదవ్, దేశ్‌ముఖ్ రాజు, నరేశ్, కవిత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సన్మానం

యూనివర్సిటీ రిజిస్ట్రార్ శరత్ చంద్రను సన్మానిస్తున్న డెయిరీ టెక్నాలజీ సిబ్బంది

కామారెడ్డి, నవంబర్ 23 : పీవీ నర్సింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కామారెడ్డి డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్‌గా పని చేసిన డాక్టర్ శరత్ చంద్ర నియమితులై శనివారం మొదటి సారిగా రిజిస్ట్రార్ హోదాలో కామారెడ్డి డెయిరీ కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ఉమాపతి, స్వర్ణలత, రవీందర్ రెడ్డి, మాధవి, శరత్, శైలజ, ముఖీద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కామారెడ్డి, నవంబర్ 23 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని అడిగితే నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి అజయ్, నాయకులు మణికంత, రాహుల్, నితిన్, సాయి కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలప తరలిస్తున్నా.. పట్టించుకోరా!

- చోద్యం చూస్తున్న అధికారులు
- మోటర్ సైకిళ్లపై పచ్చి కలప తరలింపు
- అడవులను రక్షించాలని కోరుతున్న ప్రజలు

బాన్సువాడ రూరల్, నవంబర్ 23 : బాన్సువాడ మండలంలోని బోర్లం, కొయ్యగుట్ట, మొండి సడాక్ గండి అటవీ ప్రాంతం నుంచి నిత్యం వందల సంఖ్యలో మోటర్ సైకిళ్లపై పచ్చి కలప తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వేకువజామునే మోటర్ సైకిళ్లపై అడవికి వెళ్లి చెట్లను నరికి కలపను తీసుకొచ్చి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు రోజూ కలపను తీసుకొచ్చి ఒక దగ్గర నిల్వ ఉంచి రాత్రి వేళలో వాహనాల్లో తరలిస్తున్నారు. సమీప గ్రామాలకు కూతవేటు దూరంలోనే అటవీశాఖ కార్యాలయం ఉన్నప్పటికీ కలప తరలింపుపై అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం వందలాది వృక్షాలు అడవుల్లో నేలకొరుగుతున్నాయి. మోటర్ సైకిళ్లపై తీసుకొచ్చిన కలపకు రూ. 8వందల నుంచి రూ.వెయ్యికి బాన్సువాడలో అమ్ముకుంటున్నారు. ఈ వ్యాపారం బాగుండడంతో పచ్చి కలప తీసుకొస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఉదయం 6 గంటలకు మోటర్ సైకిళ్లపై అడవులకు వెళ్లి తిరిగి 9 గంటలకు కలపతో తిరుగు ప్రయాణం అవుతున్నారు. ప్రతి రోజూ సుమారు వందకుపైగా మోటర్ సైకిళ్లపై కలపను తరలిస్తున్నా సంబంధిత అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అడవులను రక్షించాలని కోరుతున్నారు.

బోర్లం అడవి నుంచి మోటర్ సైకిల్‌పై తీసుకెళ్తున్న కలప

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కామారెడ్డి, నవంబర్ 23 : పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వీఎల్ నరసింహారెడ్డి మాట్లాడారు. వాటర్ వర్క్స్, శానిటేషన్ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు లేవన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌లో కార్మికులకు కనీసం వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దరశథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రఖండ నూతన కమిటీ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నస్రుల్లాబాద్, నవంబర్ 23 : విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ప్రఖండ నూతన కమిటీని శనివారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరిగె నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆరేళ్ల సునీల్ గౌడ్, కోశాధికారిగా శివసాగర్, సస్తాంగ్ ప్రముఖ్‌గా రాఘవ ధర్మ ప్రసాద్, సంయోజక్‌గా నాగరాజు, సహ సంయోజక్‌గా బండారి కృష్ణ, గోరక్షక్ సంయోజక్‌గా మహదేవ్ రామకృష్ణ, బలోపసన్, మహేందర్, సేవా ప్రముఖ్‌గా చంద్రకాంత్, ప్రచార ప్రముఖ్ భాస్కర్‌ను ఎన్నుకున్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, నవంబర్ 23 : పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి శనివారం అందజేశారు. మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్నవారు ఆందోళన చెందకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు

బీబీపేట్,(దోమకొండ) నవంబర్ 23: గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ‘జోరుగా గంజాయి దందా’ అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై దోమకొండ ఎక్సైజ్ సీఐ స్పందించి సిబ్బందితో కలిసి దోమకొండ శివారులోని (గుండ్ల చెరువు) మినీ స్టేడియం సమీపంలో, పలుగడ్డ బహిరంగ ప్రదేశంలో, ముత్యంపేట్ రోడ్డు వద్ద పరిశీలించినట్లు తెలిపారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రజలు, యువకులకు మత్తు పదార్థాలు, వాటితో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు తీసుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సుదర్శన్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రయాలపై స్పందించని దోమకొండ పోలీసులు

దోమకొండ పోలీస్ అధికారులు స్పందించి మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించి జీవితాలు నాశనం కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పోలీస్ అధికారులు స్పందించకపోవడంతో మండల ప్రజలు విమర్శిస్తున్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి ప్రజలు, యువతకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పాల్వంచ ఆర్ఐ బదిలీ

మాచారెడ్డి, నవంబర్ 23 : పాల్వంచ ఆర్ఐగా పనిచేస్తున్న విద్యాసాగర్ బదిలీపై రామారెడ్డికి వెళ్లినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ఆయన స్థానంలో రామారెడ్డి నుంచి శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై రానున్నట్లు తెలిపారు. సోమవారం విధులో చేరే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

బాన్సువాడ రూరల్, నవంబర్ 23 : బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన వెన్నెల, మృదుల (అండర్-19) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి, పీఈటీ సుప్రిత శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కళాశాల తరఫున ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల అధ్యాపకులు విద్యార్థినులకు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

బాన్సువాడ రూరల్, నవంబర్ 23 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. కళాశాలలో ఎన్‌సీసీ ఉండడం విద్యార్థులకు వరమని అన్నారు.

ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎన్‌సీసీ కెడెట్లు

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

బాన్సువాడ టౌన్, నవంబర్ 23 : ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా జయంతిని బాన్సువాడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారిణి విజయ భారతి మాట్లాడుతూ.. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సునీత, సుజాత, అనసూయ, కవిత, బిందు, విజయలక్ష్మి, శిరీషా, సంధ్య, భారతీ, బంజారా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలి’

ఎల్లారెడ్డి పట్టణంలోని పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 23: ప్రస్తుత కాలంలో ప్రతి విషయం ఆధార్‌తో ముడిపడి ఉన్నందున, ప్రజలు ఆధార్ సెంటర్‌పై ఆధారపడుతుంటారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆధార్‌సెంటర్ నిర్వాహకునికి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆధార్ సెంటర్‌ను శనివారం సందర్శించి అక్కడి పనితీరును ఆయన పరిశీలించారు. సెంటర్‌కు వచ్చిన వారితో మాట్లాడారు. ఆయనతో పాటు తహసీల్దార్ అల్లం మహేందర్ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆర్డీవో..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 23 : ఎల్లారెడ్డి పట్టణంలోని పోలింగ్ స్టేషన్లను, అక్కడి మౌలిక సదుపాయాలను ఆర్డీవో మన్నె ప్రభాకర్ శనివారం పరిశీలించారు. ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం తప్పనిసరిగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ అల్లం మహేందర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆలయంలో అభిషేకాలు

నాగిరెడ్డిపేట, నవంబర్ 23: తాండూర్ శివారులోని మహిమాన్విత త్రిలింగేశ్వరాలయంలో మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి కార్తీక మాస పురస్కరించుకొని శనివారం అభిషేకాలు చేశారు. ఆలయంలోని రామేశ్వరుడు, భీమేశ్వరుడు, సోమేశ్వరులకు అభిషేకాలు చేశారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పొలం అమ్మబడును
★ భీమ్‌గల్ మడలంలోని చెంగల్ గ్రామ శివారులో బోర్లు కలిగి రెండు పంటలు వరి పండే 6.14 ఎకరాల పట్టాల్యాండ్ అమ్మకానికి కలదు. సెల్: 9960996111
NTZ- 338221

PLOT FOR SALE
★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
“పేరు మార్పిడి” ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

లింగంపేట, నవంబర్ 23: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని ప్రత్యేక అధికారి దీప్తి అధికారులకు సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. మండలంలోని సమగ్ర కుటుంబ సర్వే పూర్తి అయినట్లు అధికారులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఆన్‌లైన్ నమోదులో ఏవైనా అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకుని నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి (లోకల్‌బాడీ), తాడ్వాయి మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్, ఆన్‌లైన్ నమోదు సిబ్బంది ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి దీప్తి

98 శాతం సర్వే పూర్తి..

లింగంపేట, నవంబర్ 23: మండలంలోని ఆయా గ్రామాల్లో 98 శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో నరేశ్ శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 14,423 గృహాలు ఉన్నాయని, నేటి వరకు 14వేల గృహాల సర్వే పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఎన్యుమరేటర్ల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో మల్హరీ ఉన్నారు.

‘ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా’

మద్నూర్, నవంబర్ 23: జుక్కల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైందన్నారు. స్పోర్ట్స్ స్కూల్ కోసం సైతం ప్రభుత్వానికి నివేదించామని, త్వరలో అదికూడా మంజూరవుతుందన్నారు. పాఠశాలతో పాటు స్టేడియం కూడా ఏర్పాటవుతుందని తెలిపారు.

తప్పిన ప్రమాదం..

బాన్సువాడ, నవంబర్ 23 : బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో శనివారం ద్విచక్ర వాహనానికి ఆకస్మికంగా మంటలు వచ్చాయి. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం కింద మంటలు చూసుకోకుండా వెళ్తున్నాడు. రోడ్డుపై వెళ్తున్న వారు గమనించి వాహనం కింద మంటలు వస్తున్నాయని అరవడంతో సదరు వ్యక్తి వాహనం వదిలి పక్కకు పరుగెత్తాడు. ఒక్కసారిగా మంటలు పెరగడంతో చౌరస్తాలో ఉన్న వ్యాపారులు నీటిని తెచ్చి మంటలు ఆర్పడంతో స్థానికులు, వాహనదారుడు ఊపిరిపీల్చుకున్నారు.

అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య

రామారెడ్డి, నవంబర్ 23 : అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన అడ్లూర్ ఎల్లారెడ్డిలో శనివారం చోటు చేసుకుంది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. తండా లింగం(45) తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు ఆడ పిల్లలు. అందులో ఇద్దరికి పెండ్లయింది. వారి పెండ్లికి చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

బీబీపేట, నవంబర్ 23 : జీవితంపై విరక్తితో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాడారం గ్రామానికి చెందిన అల్లెపు మల్లయ్య(60)పై కొన్ని కేసులు ఉన్నాయన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మల్లయ్య యాడారంలోని అవుసుల కుంట దగ్గర పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. విషయం తెలియడంతో భార్య అల్లెపు సాలవ్వ ఘటన స్థలానికి వెళ్లి చూసిన అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఏరియా దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘మనస్పర్థలే విడిపోవడానికి కారణం’

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 23: భార్యాభర్తల మధ్య వచ్చే చిన్నచిన్న మనస్పర్థలే విడిపోవడానికి కారణమవుతాయని, అలా కాకుండా తేలికగా తీసుకుంటే కుటుంబాలు ఆనందమయమవుతాయని షీటీం సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుటుంబ స్నేహితలో విడిపోవడానికి సిద్ధంగా ఉన్న మూడు కుటుంబాలకు చెందిన భార్యాభర్తలకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. విడిపోవడానికి తొందర పడకుండా కలిసి ఉండడానికి ప్రాధాన్యమివ్వాలని ఆయన సూచించారు.

గోడ ప్రతుల ఆవిష్కరణ

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 23: పిట్లం మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల సమరభేరి గోడ ప్రతులను బీసీ సంక్షేమ సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే బీసీల సమరభేరి సభను బీసీలు, బహుజనులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, నాయకులు లోక సంతోష్, ఆకుల లక్ష్మణ్, అశోక్ రాజ్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్నా ఉపాధ్యాయులు

మాచారెడ్డి, నవంబర్ 23 : కామారెడ్డిలో డిసెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి శనివారం ఆవిష్కరించారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ, రాజు, పడిగె రాజయ్య, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్‌లో విద్యార్థినికి రజతం

పెద్దకొడప్‌గల్, నవంబర్ 23 : జాతీయ స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ 2024లో ఎస్సీ గురుకుల విద్యార్థులు పతకాలు సాధించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని లావణ్య అండర్-15 కేటగిరీలో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా లావణ్యను, అకడమిక్ కోచ్ దాసరి ప్రియాంక, పాఠశాల పీఈటీలు సుష్మ, జ్యోతిని పాఠశాల ప్రిన్సిపాల్ సునీత శనివారం అభినందించారు.

విద్యార్థిని లావణ్య

గాంధారిలో వింత కీటకం ప్రత్యక్షం

గాంధారి, నవంబర్ 23: మండల కేంద్రంలో శనివారం వింత ఆకృతిలో ఉన్న కీటకం ప్రత్యక్షమైంది. ఆ కీటకం మొహంపై పెద్ద కండ్లు, ముక్కు, మీసాలతో భయంకరంగా ఉంది. ఈ కీటకం రెక్కలపై ఆర్మీ జవాను ధరించే దుస్తులపై ఉండే రంగులు ఉన్నాయి. వింతాకృతిలో ఉన్న కీటాకాన్ని చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కీటకాన్ని పలువురు తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీశారు.

వింత కీటకం

నాటక ప్రదర్శనకు ఆర్థిక సాయం

గాంధారి, నవంబర్ 23: మండలంలోని నాగ్లూర్ గ్రామంలో సూర్య చంద్రుల నాటక ప్రదర్శనకు మండల కేంద్రానికి చెందిన తాడ్వాయి భాస్కర్ శనివారం రూ.11 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ డబ్బులతో నాటకానికి అవసరమైన మేకప్ సామగ్రి, దుస్తులు కొనుగోలు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గాంధారి/రాజంపేట్, నవంబర్ 23 : గాంధారి మండలంలోని తిప్పారం గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, నాయకులు బిషన్‌నాయక్, గంగారాం, శ్రావణ్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, నాగరాజు, మహేశ్ తదితరులు ఉన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో బస్వన్నపల్లి, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, ఎల్లాపూర్ తండా, శేర్‌శంకర్ తండాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బీమరి శ్యామయ్య, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 23: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో పీజీటీ బోటనీ బోధించడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎమ్మెస్సీ బోటనీ, బీఈడీ చేసినవారు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బోధించవలసి ఉంటుందని పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

మాచారెడ్డి/భిక్కనూరు/నాగిరెడ్డిపేట, నవంబర్ 23 : ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా శ్రద్ధ వహించాలని ఎంఈవో దేవేందర్‌రావు అన్నారు. ఎల్లంపేట, నడిమి తండా ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నేషనల్ అచివ్‌మెంట్, సర్వే మాక్ టెస్ట్‌పై విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరత్నం, సరోజిని, సీఆర్పీ సంజీవ్ ఉన్నారు. భిక్కనూరు మండలం గిద్ద దళితవాడలోని ఎంపీపీఎస్, బస్వాపూర్ పాఠశాలలను ఎంఈవో రాజా గంగారెడ్డి తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని కెరళ పాఠశాల, శ్రీసాయి పబ్లిక్ స్కూల్ ను శనివారం ఎంఈవో భాస్కర్ తనిఖీ చేశారు. కెరళ పాఠశాలలో మౌలిక వసతులు సక్రమంగా లేనందున వాటిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో తెలంగాణ గీతాన్ని తప్పకుండా విద్యార్థులతో పాడించాలని ఎంఈవో భాస్కర్ పేర్కొన్నారు.